ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023
5
కర్నూలు





సిపిఎం ఆధ్వర్యంలో కర్నూలు కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించిన ప్రజలు

'కార్పొరేషన్' ముట్టడి

- కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనేక కాలనీలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నగరకమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. కాలనీల్లో సమస్యలు తిష్టవేశాయని న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన చేపట్టిన ముట్టడి కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయని, వాటిని పరిష్కరించే విషయంలో కార్పొరేషన్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవ చూపడం లేదని విమర్శించారు. కర్నూలు నగరంలో రోడ్లపై చెత్తాచెదారం పేరుకపోయి ఉందని, తగినంత సిబ్బంది లేక రోడ్లు శుభ్రం చేయక మురుగు కాలువలలో సిల్ట్ తీయక చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపైకి, ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు. దీనికి కారకులు పాలకులు, రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు కష్టాలలో ఉంటే మున్సిపల్ కార్పొరేషన్ వారు చెత్త పన్ను, ఆస్తి విలువపై పన్ను, మంచినీటి పన్ను, ఇలా పన్నుల భారంతో ప్రజలను పీకలలోకతు కష్టాలలోకి నెట్టివేస్తున్నారని గుర్తు చేశారు. జొహరాపురం షద్రక్ కాలనీలో గత 12 సంవత్సరాలుగా, హైదర్ ఖాన్ నగర్ లో 20 సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకొని నివాసముంటున్నప్పటికీ వారికి మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. 17వ వార్డులోని లక్ష్మీ గార్డెన్ కొట్టాలలో కూడా అదేవిధంగాఉందన్నారు. 43 వవార్డు పంప్ హౌస్‌కు ఎదురుగా ఉన్న గూడెం పేద ప్రజలకు ఉన్న సామూహిక మరుగుదొడ్లు పాడై పోయినా పట్టించుకోవడంలేదన్నారు. కల్లూరు కాలనీలలో రోజుమంచినీళ్ళు వచ్చే పరిస్థితి లేదన్నారు. వారానికి ఒకసారి నీళ్లు వస్తున్నాయని ప్రతి రోజూ నీళ్లు ఇవ్వాలని డిమ్యాండ్ చేశారు. ముజఫర్ నగర్ కమ్యూనిటిహాల్ సమస్యను పరిష్కరించాలని, సుద్దవాగుసమస్యను పరిష్కరించాలని లేదంటే మరోసారి ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు సి.హెచ్.సాయిబాబా, ఆర్.నరసిహులు, కె.సుదాకరప్ప, విజయ్, డి.అబ్దుల్ దేశాయ్, ఎస్ఎండి.షరీఫ్, రామకృష్ణ, ఎస్ఎ.ఇగ్బాల్, కె.ప్రభాకర్, మహ్మద్ రఫీ, ఎం.భాస్కర్, ఎస్.లాల్ మహమ్మద్ , వి.శంకర్, జనార్ధన్, అనంద్, ఓబులమ్మ, లక్ష్మీ, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల షాక్..!

'బేతంచర్లకు చెందిన నబిరసూల్ గత నెల లాగానే ఈ నెల కూడా విద్యుత్‌ను వినియోగించారు. గత నెల రూ.494 విద్యుత్ బిల్ వచ్చింది. అది ఈ నెలకు రూ.878కి పెరిగింది. అంటే దాదాపు రెట్టింపయింది.' ఇలా ఆయనొక్కరికే కాదు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అందరికీ విద్యుత్ బిల్ భారీగా పెరిగింది. ట్రూఅప్ పేరుతో ప్రభుత్వం అదనపు బాదుడు వేయడమే అందుకు ప్రధాన కారణం...



భారంగా పెరిగిన బిల్లులు



నా భర్త పాలిష్ బండల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆయనకు వచ్చే జీతంతో కుటుంబం గడుస్తోంది. గత నెలకు, ఈ నెలకు భారీగా విద్యుత్ బిల్లులు పెరిగాయి. అది భారంగా మారింది. గత నెల రూ.494 బిల్లు వస్తే ఈ నెల రూ.878 వచ్చింది. అంతంత బిల్లులు వస్తే ఎలా కట్టాలి.

- ఎస్.రెహానా, బేతంచర్ల.

- భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- ఒక నెలలోనే సామాన్యులపై రూ.2.31 కోట్ల భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాన్యులకు ఈ నెలలో విద్యుత్ బిల్లులు ముట్టుకోవాలంటేనే షాక్ కొడుతోంది. గత ఏడాది ఆగస్టు నుంచే తొలి విడత ట్రూఅప్ చార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ చార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 11,19,459 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆ కనెక్షన్ల వినియోగదారులందరూ కలిసి మే నెలలో 10.04 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగా కి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. అంటే 100 యూనిట్లు వినియోగించిన వినియోగదారులకు రూ.23 చొప్పున, 200 యూనిట్లు వాడిన వారికి రూ.46, 300 నుంచి 400 యూనిట్లు వాడిన వారికి రూ.69 నుంచి రూ.92 మేర ట్రూఅప్ రూపంలో పెరిగింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారులందరి మీద ఒక్క నెలలోనే రూ.2.31 కోట్ల మేర ట్రూ అప్ భారం పడింది.

ఎఫ్‌పిపిసిఎ రూపంలో రూ.6.32 కోట్లు

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న గృహ వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో ఈ ఒక్క నెలలోనే రూ.6.32 కోట్ల మేర భారం పడింది. వినియోగదారులపై ట్రూఅప్‌తో పాటు ఎఫ్‌పిసిసిఎ రూపాల్లో భారం వేయడంతో యూనిట్‌కు 63 పైసల చొప్పున భారం పడింది. గతంలో నెలకు రూ.150 నుంచి రూ.300 వచ్చే వారికి రూ.250 నుంచి రూ.600 వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. రూ.400 నుంచి రూ.600 వచ్చే వారికి రూ.600 నుంచి రూ.800, రూ.600 నుంచి రూ.800 బిల్లు వచ్చే వారికి రూ.850 నుంచి రూ.1100 వరకూ ఈ నెల విద్యుత్ బిల్లులు వచ్చాయి.

సోలార్ పరిశ్రమ భూ బాధిత రైతుల పునరావాసం కోసం
తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతులకు హైకోర్టు ఆదేశాల మేరకు పునరావాసం కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓర్వకల్లు తమశీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున రైతులు నినాదాలు చేస్తూ మండల అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. జి.రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మాట్లాడుతూ సోలార్ పరిశ్రమ కోసం 2015లో భూములు రైతుల నుండి తీసుకున్నారని, ఎనిమిదేళ్లయినా పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా ఆదేశాలను అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఒకపక్క భూములు పోయి పనులు లేక అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్న రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పునరావాసం కోసం జిల్లా లోక్ అదాలత్ కోర్టులో 2019 లో కేసు వేశారని, అప్పటినుండి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అధికారులు రైతుల పట్ల సానుకూలంగా స్పందించి రైతులకు అనుకూలంగా నివేదికలు పంపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేకపోతే రైతులు దశల వారీగా ఆందోళనలు చేపడతారని హెచ్చరించారు. సిఐటియు మండల అధ్యక్షులు శ్రీధర్, నాయకులు చాంద్ బాషా, సుధాకర్, రైతులు మల్లమ్మ, లక్ష్మీదేవి, మనోహర్ అన్న నాగన్న, భూషన్న పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

సిపిఎం పోరాట ఫలితమే

- జిజిహెచ్‌కు రూ. 2.72 కోట్ల నిధులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల మెయింటెనెన్స్ చాలా అధ్వానంగా ఉన్నదని సిపిఎం గత రెండేళ్లుగా వివిధ రూపాలలో పోరాటం చేస్తూ వస్తుంది. ఈ పోరాటాల ఫలితమే నేడు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.72 కోట్లు నిధులు ఎపిఎంఐడిసికి మంజూరు చేసింది. ఏడాదిన్నర క్రితం సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జిజిహెచ్‌లోని అన్ని వార్డులలో కలియ తిరుగుతూ వార్డుల్లోని సమస్యలను తెలుసుకుంటూ రోగులు వారి బంధువులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆసుపత్రి అధికారులకు, జిల్లా కలెక్టరుకు నివేదికలు అందజేశారు. ప్రధానంగా వార్డుల్లో పైకప్పుల పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. రోగులు వారి బంధువులు అక్కడ సేవలందించే వైద్య సిబ్బంది గాయాల పాలవుతున్నారు. ఫ్లోరింగ్ అంతా పగిలిపోయి ఎగుడు దిగుడుగా ఉంటూ స్ట్రెక్చర్లపై రోగులను తోసుకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లో విద్యుత్ దీపాలు లేక చీకట్లోనే వైద్య సిబ్బంది రోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ఫ్యాన్లు కూడా పనిచేయకపోవడంతో ఉక్క పోతకు రోగులు అల్లాడుతున్నారు. టాయిలెట్స్‌లో నీటి సౌకర్యం లేక కంపు కొడుతున్నాయి. ఇది ఏమిటని అడిగితే వాటర్ మెన్స్ లేరు అనే సమాధానం ఆస్పత్రి అధికారుల నుంచి వస్తుంది. ఇంకా ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లే మురుగునీరు పైపులు బ్లాక్ అయి రహదారుల పైకి మురుగునీరు వస్తుంది. ఈ మురుగునీటిలోనే డాక్టర్లు ఆసుపత్రికి వస్తున్నారు. అనేకమంది దాతలు స్ట్రెక్చర్లు, వీల్ చైర్లు ఇచ్చినా ఫ్లోరింగ్ సరిగా లేకపోవడంతో అవి కొద్ది రోజుల్లోనే పాడైపోతున్నాయి. పాడైన వాటిని మరమ్మతులు చేయించేందుకు ఆసుపత్రి పాలకమండలి వద్ద చిల్లిగవ్వ కూడా లేదని ఆందోళన చేస్తున్న సమయంలో అధికారులు చెప్పడం విశేషం. ఇలాంటి పరిస్థితులలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఆధ్వర్యంలో అన్ని వార్డులను తనిఖీ చేసి పరిశీలించి అక్కడ కావలసిన సౌకర్యాలు ఏమిటో గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. ఇలా రెండేళ్లుగా చేస్తున్న పోరాటల ఫలితంగా నేడు ప్రభుత్వం ఎపిఎంఎస్ఐడిసికి రూ 2.72 కోట్లు నిధులను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం బోధనాసుపత్రులకు గ్రాంట్‌ను విడుదల చేస్తూ ఇటీవలే ఒక ప్రకటనను విడుదల చేసింది. కర్నూలు ప్రభుత్వ వైద్యశాల మెయింటెనెన్స్ కింద రూ.2.72 కోట్లు మంజూరు చేశారు. ఆసుపత్రి వార్షిక నిర్వహణ ఒప్పందాల అవసరాలు, సివిల్, ఎలక్ట్రికల్, పరికరాలు, ఫర్నిచర్ (మంచాలు , పడకలు) అన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఎసిలు, , లిఫ్టులు, ఆర్ఓ ప్లాంట్లు, ఐటి హార్డ్‌వేర్, సిసి కెమెరాలు, ఎస్‌టిపి ప్లాంట్లు, అగ్నిమాపక పరికరాలు, పి ఎస్ఎ ప్లాంట్లు, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు ఫ్యాన్‌లు, లైట్లు, స్విచ్‌బోర్డ్లు అండ్ ఇతర అన్ని ఎలక్ట్రికల్ ఉపకరణాలకు వెంటనే మరమ్మతులు , పని చేయని లైట్లు, ఫ్యాన్ లేదా ఇతర ఎలక్ట్రికల్ కోసం వార్షిక నిర్వహణ ఒప్పందాల పనులు చేపట్టే అవకాశం ఉంది.



స్క్రాప్ స్టోర్‌గా వాడుతున్న గదిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)

ఆసుపత్రి లో సౌకర్యాలు మెరుగుపరచాలి
- గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం విడుదల చేసిన రూ 2.72 కోట్ల నిధులను అన్యాక్రాంతం చేయకుండా సద్వినియోగం చేయాలి. రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ప్రధానంగా టాయిలెట్స్ నీటి సౌకర్యంతో పాటు ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలి. అలాగే ఫ్యాన్లు విద్యుత్ లైట్లు పనిచేసే విధంగా చూడాలి. రోగుల సంఖ్య అధికంగా ఉండటంవల్ల తగినన్ని స్ట్రెక్చర్లను అందుబాటులో ఉంచాలి. సిపిఎం పోరాట ఫలితంగా నిధులు మంజూరు కావడం పట్ల హర్షం ప్రకటిస్తున్నాం.

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

45 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం విడుదల చేసింది. కర్నూలు జిల్లా 45.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో కర్నూలు జిల్లా 25వ స్థానంలో నిలిచింది. 7,663 మంది బాలురులో 3,074 మంది బాలురు ఉత్తీర్ణత 40.11 శాతంంగా ఉంది. 4,858 మంది బాలికల్లో 2,576 మంది బాలికలు ఉత్తీర్ణత 53.03 శాతం ఉత్తీర్ణత శాతం నమోదయింది.

జగనన్న సురక్షపైఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలో ప్రభుత్వం అమలులోకి తెచ్చిన జగనన్న సురక్ష పథకంపై గ్రామాల్లో అవగాహన విస్తృతం చేయాలని ఎంపిడిఒ రాముడు సూచించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించి మాట్లాడారు. వచ్చే నెల ఒకటి నుండి చివరి వరకు గృహ సారథులు ఇంటింటికి వెళ్లి పథకాల అమలులో అర్హులకు న్యాయం జరిగేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. వాలంటీర్లు గ్రామాల్లో ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య

యోగా పోటీలలో రవీంద్ర విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన యోగా పోటీలలో రవీంద్ర పాఠశాలల విద్యార్థులు వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. 14, 16 సంవత్సరాల బాలికల విభాగంలో రవీంద్ర బాలికల పాఠశాల విద్యార్థిని జిఎస్. శ్రీలక్ష్మి (10వ తరగతి) ప్రథమ బహుమతిని సాధించారు. బాలుర విభాగంలో 10, 12 సంవత్సరాల కేటగిరిలో ఆరవ తరగతి రవీంద్ర ఐసి పాఠశాల కు చెందిన సి.లిఖిత్(6వ తరగతి) ద్వితీయ బహుమతిని సాధించారు. 8, 10 సంవత్సరాల బాలుర విభాగంలో సి. సాకేత్(4వ తరగతి) మూడవ స్థానాన్ని సాధించారు. ఈ పతకాలు సాధించిన విద్యార్థులకు రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుల జి. పుల్లయ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ పతకాలు సాధించడానికి ప్రేరేపించిన వారి తల్లిదండ్రులకు ,యోగా మాస్టర్‌కు జి.పుల్లయ్య, విద్యాసంస్థల ఛైర్మన్ జివిఎం. మోహన్ కుమార్, అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



సిఎం ' జగనన్న సురక్ష ' ప్రారంభంలో కర్నూలు నుంచి ఎంపీ , కలెక్టర్ , ఎమ్మెల్యే

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా మిగిలి పోకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టర్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్ తదితరులు కలెక్టరేట్ నుండి వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల లబ్ధి అందరికీ పూర్తి స్థాయిలో పొందాలనే ధృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇంటింటినీ సందర్శించి, అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి లబ్ధి చేకూర్చడం, సర్టిఫికేట్ లు ఏవైనా అవసరం ఉంటే వాటిని ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ రకాల సర్టిఫికెట్లు (జనన మరణ, పంట సాగు కార్డులు, ఆదాయ, కుల, రేషన్ కార్డ్స్ విభజన, కొత్త రేషన్ కార్డులు, ఆధార్ కార్డులో మార్పులు, ఆధార్ కార్డు బ్యాంకు అనుసంధానం) తదితర వాటిని పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ 11 రకాల సేవలు పొందడానికి ఎటువంటి రుసుం చెల్లించాల్సి అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మొదటగా జూన్ 24వ తేది నుంచి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిపొందని లబ్ధిదారుల వివరాలను తీసుకొని సచివాలయానికి వెళ్లి తగిన పత్రాలను సమర్పించి, అందుకు తగిన సర్వీసు రిక్వెస్ట్ నంబర్ తీసుకొని వచ్చి సంబంధిత లబ్ధిదారునికి సదరు టోకెన్ నంబర్ అందించి ఏ రోజున క్యాంపు నిర్వహిస్తారో తదితర వివరాలను వారికి తెలిపి ఆ రోజున క్యాంపు వరకు వారిని తీసుకొని వెళ్లి వారి సమస్యను పరిష్కరించేలా చూస్తారన్నారు. సదరు రోజుల్లో మండల స్థాయి సిబ్బంది రోజంతా సచివాలయంలో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారన్నారు. జూలై 1 నుంచి ప్రతి మండల స్థాయిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులకు ఉన్న సమస్యకు పరిష్కారం చూపడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. అందుకు అనుగుణంగా అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ నాగేశ్వర రావు, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, సిపిఒ అప్పలకొండ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చదువును దూరం చేస్తున్న జగన్ మామ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ఆర్ఐఒ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా సిఎం వైఎస్ జగన్ మామ చదివును దూరం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ఐఒ ఆఫీస్ ముందు విద్యార్థులతో బైఠాయించారు. డివిఇఒ బయటకు వచ్చి విద్యార్థుల సమస్యలు విని వినతిపత్రాన్ని స్వీకరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులను చదువు దూరం చేస్తున్నారన్నారు. గత సంవత్సరం విద్యాశాఖ మంత్రి వచ్చే సంవత్సరం మొదటి కల్లా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటిదాకా ఇంటర్మీడియట్ పుస్తకాలు ప్రింటింగ్ కూడా కాలేదన్నారు. ప్రభుత్వం విద్యార్థులు బయట నుండి కొనుక్కోవాలని అంటుందన్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కార్పొరేట్ కళాశాల పైన పెట్టిన శ్రద్ధ ప్రభుత్వ కళాశాల పైన పెట్టడం లేదన్నారు. కేవలం హంగు ఆర్భాటలకే పరిమితం అవుతుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వ విద్య నిర్వీర్యం చేసేలాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరి స్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్య పెంచేందుకు వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గొప్పలు చెప్పుకుంటుంది కానీ క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే ఇంతవరకు పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా ఏ రకంగా పెద్దపీట వేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం హంగు ఆర్భాటాలు ప్రచారాలకి పెట్టే ఖర్చు పాఠ్య పుస్తకాల పైన పెట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో పాస్ పర్సెంటేజ్ తగ్గిపోయిందన్నారు. ఇప్పటికైనా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సిటీ అధ్యక్షులు అమర్, సిటీ ఉపాధ్యక్షుడు నరసింహ, యోగి, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు మైన , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వెల్దుర్తి సిహెచ్‌సిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరం

పిసిఅండ్ పిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-వెల్దుర్తి : లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టప్రకారం నేరమని జిల్లావ్యాధినిరోధక టీకాలఅధికారి, పిసిఅండ్ పిఎన్‌డిటి నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన వెల్దుర్తి సిహెచ్‌సిని తనిఖీ చేశారు. టీకాలు నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ప్రవీణ్‌కుమార్ ట్లాడుతూ ఆసుపత్రిలో కాన్పు అయిన చిన్న పిల్లలకు 0 డోస్ టీకాలు తప్పకవేయాలని ఆదేశించారు. వెల్దుర్తి సిహెచ్‌సిలో రిపోర్ట్స్‌ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. లింగ వివక్షత నిర్మూలన, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం (పిసి అండ్ పిఎన్‌డిటి), ఆడపిల్లల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమని, దీన్ని అరికట్టాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ - నియంత్రణ దుర్వినియోగనివారణ చట్టం -1994 ను తెచ్చిందన్నారు. సమాజంలో స్త్రీపురుషులు ఇరువురు సమానమేనని అన్నారు. ఈనాడు అన్ని రంగాలలోను స్త్రీలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఈవిషయాలపై అవగాహన కల్పించాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ ప్రతిభా గ్లోరి, డాక్టర్ రంగస్వామి, పిసి అండ్ పిఎన్‌డిటి ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటెద్దుతో 10 ఎకరాలలో ఆముదం విత్తిన రైతు

ప్రజాశక్తి-తుగ్గలి



ఒంటెద్దుతో రైతు కటారకొండ లాల్‌స్వామి

తుగ్గలి మండలం పరిధిలోని రాంపల్లి గ్రామంలో రైతు కటారకొండ లాల్ స్వామికి చెందిన ఒంటెద్దు పది ఎకరాలలో ఆమదాన్ని విత్తి రికార్డ్ సృష్టించింది. ఉదయం ఆరు గంటల నుండి ఒంటిగంట వరకు తమకున్న పది ఎకరాలలో రైతు లాల్ స్వామి మరొక ఎద్దు ప్రమేయం లేకుండా శుక్రవారం విత్తనాలను వేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రెండు ఎద్దులే పది ఎకరాలు వేయలేని పరిస్థితి అటువంటి సమయంలో ఒకే ఎద్దుతో పది ఎకరాలలో విత్తనాన్ని వేసింది. ఈ విషయాన్ని చూడటానికి ఈ విషయాన్ని చూడటానికి చుట్టూ పక్కల రైతులు, గ్రామస్తులు ఎద్దును, రైతును చూసి అభినందించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ

ప్రజాశక్తి - ఆస్పరి

కేంద్రంలోని బిజెపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ కోరారు. శుక్రవారం ఆస్పరి సబ్ స్టేషన్ దగ్గర ఆస్పరి, దేవనకొండ మండలాల్లోని పార్టీ సభ్యుల శిక్షణ తరగతులు నిర్వహించారు. సిపిఎం దేవనకొండ మండల కార్యదర్శి వీరశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకికవాదాన్ని నాశనం చేస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజలపై భారం మోపిందన్నారు. మోడీ ప్రభుత్వం అదాని, అంబానీ లాంటి బడాబాబులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు చిన్న సుంకన్న, మాణిక్యప్ప, బాలకృష్ణ, రంగస్వామి, రామాంజినేయులు, మల్లేష్, మధు రెడ్డి, రవి, రామాంజినేయులు, రంగప్ప, అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

‘అంగన్వాడీ’ల్లో పౌష్టికాహారమందించాలి

- వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

అంగన్వాడీ కేంద్రాల ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద గర్భిణులు, బాలింతలు, పిల్లలందరికీ పౌష్టికాహారం అందించాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ మురళీ మోహన్ రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పెద్దభొంపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో సరైన ఆహారం అందిస్తున్నారా, లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త కేశమ్మ రికార్డులను పరిశీలించారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అందరికీ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం అందించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. గ్రామ నాయకులు గట్టు భీమయ్య, చిన్నబొంపల్లి హుస్సేని, లక్ష్మిరెడ్డి, అంజినయ్య, అంజి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మురళీమోహన్ రెడ్డి

ఒపిఎస్సే ప్రత్యామ్నాయం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఎపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదని, ఒపిఎస్సే ప్రత్యామ్నాయమని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగ, జిల్లా సహాధ్యక్షులు బి.జీవిత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టుగా ఉన్న సిపిఎస్ రద్దుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. పాత పెన్షన్ విధానం తప్ప తమకు మరేదీ వద్దన్నారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఎం.మల్లికార్జున, సీనియర్ నాయకులు పాపయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా పెద్దమ్మ అవ్వ దేవర

- జడ్‌పిటిసి విరుపాక్షి, వైసిపి నాయకులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు హాజరు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని కుందనగుర్తి గ్రామంలో అడపా బ్రదర్స్, ములగిరి బ్రదర్స్ ఆధ్వర్యంలో పెద్దమ్మ అవ్వ దేవర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ దేవర మహోత్సవానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ జోనల్ వింగ్ అధ్యక్షులు, జడ్‌పిటిసి విరుపాక్షి, వైసిపి నాయకులు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు, వైసిపి గుంతకల్ నియోజకవర్గ నాయకులు చిన్నబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పెద్దమ్మ అవ్వను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి నాయకులు ఓబులేసు, జిల్లా వాల్మీకి అధ్యక్షులు రామాంజనేయులు, లోక్‌నాథ్, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, లింగన్న, మురళీ, వలీ, జ్ఞానచంద్ర, రాము, రాజు, రామచంద్ర పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు

కూర‘గాయాలు’ పైపైకి

- కొనలేం... తినలేం..
అంటున్న సామాన్యులు

ప్రజాశక్తి - హొళగుంద

కూరగాయల ధరలు పైపైకి వెళ్తుండడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. కూరగాయల ధరలు ఇలా మండిపోతుంటే ఏం కొనలేం.. తినలేమంటూ ఆందోళన చెందుతున్నారు. ప్రతేడాది మేలో వర్షాలు కురవగా అక్కడక్కడ వంకాయ, టమోటా మాత్రమే రైతులు పండించేవారు. ఈ ఏడాది జూన్ నెలాఖరు వచ్చినా వర్షాలు కురవలేదు. బోరుబావుల కింద పండించడానికి ఎండ తీవ్రత అధికంగా ఉండడం, విద్యుత్ కోతలు ఉండడంతో ఏ రైతు కూడా కూరగాయలు పండించడానికి మొగ్గుచూపలేదు. ధరలు అమాంతంగా పెరిగి సామాన్యులకు భారంగా మారాయి. టమోటా కిలో రూ.50, బీరకాయ కిలో రూ.60, వంకాయ కిలో రూ.50, పచ్చిమిర్చి కిలో ఏకంగా రూ.100 దాటిపోయింది. ఆకుకూరలు కొత్తిమీర ఒక కట్ట రూ.20 పలుకుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పక్క రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతి

రాష్ట్రంలో వర్షాలు లేక కూరగాయలు పండించే రైతులు లేకపోవడం వల్ల పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు. రవాణా చార్జీలు పెరిగి కూరగాయల ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

కూరగాయల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దళారులు కమీషన్లకు కక్కుర్తి పడడం వల్ల ధరలు పెరుగుతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఎంత రవాణా చార్జీలు పెరిగినా ఎప్పుడూ ఇలాంటి ధరలు లేవని చెబుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కూరగాయల ధరలను నియంత్రణలో ఉంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

అక్రమ మద్యం రవాణాపై చర్యలు

- ఎస్ఐ కిరణ్ బాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

అక్రమ మద్యం రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామ సమీపంలో ఉన్న పరిమళ పెట్రోల్ బంక్ వద్ద తనిఖీలు నిర్వహించారు. రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడతట్ల నాగరాజు వద్ద నుంచి 96 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం (ఒక బాక్స్) అక్రమంగా అమ్మేందుకు బజాజ్ ప్లాటినం బైక్‌లో తరలిస్తుండగా పోలీసు సిబ్బంది వీరేష్, వీరాంజనేయులుతో కలిసి పట్టుకొని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.



వార్డుల్లో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్లు

- ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయమనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ప్రతి వార్డులోనూ రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయ మనోజ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో 31వ వార్డు ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో రూ.10.50 లక్షలతో నూతన డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఛైర్మన్ శాంత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని, ముఖ్యంగా గతంలో ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించుకోవాలని కోరారు. అందరూ అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతున్నారే తప్ప అందుకు సరైన సహకారం ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజల సహకారం లేనిదే ఎలాంటి పనులు అభివృద్ధి చేయలేమని, అభివృద్ధి పనులకు, అక్రమ కట్టడాల తొలగింపునకు పూర్తి సహకారం అందించాలని కోరారు. మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించాలంటే అక్రమ కట్టడాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైందని, వరదనీరు ఇళ్లల్లోకి పొంగిపొర్లకుండా పూడిక తొలగించాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు. తొలగింపునకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయని, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, కాంట్రాక్టర్ జయపాల్, మమ్ముత్తు స్వామి ఉన్నారు.



మురుగు కాలువలో పూడిక తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్న మహిళ

ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

- కూరగాయల వ్యాపారులపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మార్కెట్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఝాన్సీ లక్ష్మీబాయి మార్కెట్ అభివృద్ధి కోసం రూ.40 లక్షలతో అనేక పనులు చేపట్టినా వ్యాపారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని అసహనం వ్యక్తం చేశారు. పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచారని, రోడ్డుపై వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూ.40 లక్షలతో పాత మార్కెట్‌ను కొత్తగా నిర్మించినట్లు, అందులో వ్యాపారం చేయకుండా అక్కడ అంతా ఖాళీగా పెట్టి రోడ్లపై కూరగాయల విక్రయం ఎలా చేస్తారని అసహనం వ్యక్తం చేశారు. రోడ్డుపై తిరగడానికి కూడా ఇబ్బంది ఉందని, రోడ్లపై వ్యాపారాన్ని వెంటనే తొలగించాలని తెలిపారు. ఎవరికి కేటాయించిన స్థలాల్లో వారే వ్యాపారం చేయాలని సూచించారు. వ్యాపారుల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగరాదని, ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తామెవరికీ ఇబ్బంది కలిగించడం లేదని, గత 40 ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నామని, తమకు సహకరించాలని కొంతమంది వ్యాపారులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



వ్యాపారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రఘునాథ్ రెడ్డి

రైతుల అభివృద్ధికి పెద్ద పీట

- వాటర్‌షెడ్ పథకం ద్వారా రైతులకు మోటార్లు పంపిణీ
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరామ్

ప్రజాశక్తి - హాలహర్వి

రాష్ట్రంలో వైసిపి హయాంలో రైతుల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. పంట దిగుబడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం హాలహర్వి మండలం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల రైతులకు ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన పథకం కింద రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హాలహర్వి ప్రాజెక్టు, మైక్రోవాటర్ షెడ్ గ్రామాలు, వాటి ఆవాస గ్రామాల్లోని రైతులకు పంట దిగుబడి పెంచేందుకు రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. హాలహర్వి, బాపురం, మాచునూర్ గ్రామాలకు చెందిన 322 మంది రైతులు లబ్ధి పొందారని చెప్పారు. ఉత్పాదకత పెంపుదల కింద రూ.1.53 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.71.24 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రస్తుతం రైతులకు అవసరమయ్యే తైవాన్ స్ప్రేయర్లు (4 స్ట్రోక్), ఆయిల్ ఇంజిన్ (5హెచ్‌పి), టార్పాలిన్లు, వాటర్ క్యారియింగ్ పైపులు (90 ఎంఎం) అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని కోరారు. నీటిని, నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వర్షపు రూపంలో వచ్చే ప్రతి నీటి చుక్కను కాపాడుకొని పొలాల అవసరాలకు, వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించుకోవాలని తెలిపారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా కుటుంబాలను పోషించుకుంటూ ముందంజలో ఉన్నారన్నారు. రాబోయే రోజుల్లో ఆలూరు నియోజకవర్గంలో నగరడోనా రిజర్వాయర్, వేదవతి రిజర్వాయర్‌ను పూర్తి చేసి సాగు, తాగునీరందించి కోనసీమ ప్రాంతంగా రాయలసీమ మార్చుతామని తెలిపారు. అనంతరం రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, వాటర్‌షెడ్ కమిటీ ఛైర్మన్ సావిత్రమ్మ, డ్వామా అదనపు పీడీ సలీం బాష, తహశీల్దార్ మల్లికార్జున, ఎంపిడిఒ ఆంథోని, బాపురం సర్పంచి భాగ్యలక్ష్మి, జడ్‌పిటిసి లింగప్ప, హాలహర్వి ఎంపిపి నెట్టికంటమ్మ, వైస్ ఎంపిపి నాగేష్ నాయుడు, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, చింతకుంట సొసైటీ శ్రీనివాసులు, వైసిపి నాయకులు జనార్ధన్ నాయుడు, రాజశేఖర్, రాము పాల్గొన్నారు.



మోటార్లను పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరామ్

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - ఆదోని

చెక్ బౌన్స్ కేసులో ఎమ్‌డి.జుబేర్ అనే వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి తీర్పు ఇచ్చారని న్యాయవాది వీరేష్ శుక్రవారం తెలిపారు. శ్రీరామ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో బిజినెస్ కోసం జుబేర్ రుణం తీసుకున్నారని తెలిపారు. రుణం సక్రమంగా చెల్లించని ఎమ్‌డి.జుబేర్‌పై ఫైనాన్స్ యాజమాన్యం కేసు వేసినట్లు చెప్పారు. శ్రీరామ సిటీ యూనియన్ ఫైనాన్స్ కంపెనీ ప్యానల్ అడ్వకేట్ వీరేష్, ఎమ్‌డి.జుబేర్ తరపు న్యాయవాది వాదోపవాదాలు విన్న కోర్టు జుబేర్‌కు ఆరు నెలల జైలు, చెక్ అమౌంట్ రూ.4.18 లక్షలు చెల్లించాలని తీర్పు ఇచ్చిందని వివరించారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ఆదోని : గ్రామీణ నిరుపేద విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భరత్ కుమార్, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని డివిజన్ కేంద్రంలోని కళాశాలలకు, పాఠశాలకు వివిధ గ్రామాల నుంచి వందల మంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు వస్తున్నారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు సరైన సమయానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో తరగతులకు హాజరు కాలేకపోతున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఆటోల్లో ప్రయాణించి ప్రమాదాలకు గురైన సంఘటనలూ ఉన్నాయన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థి బస్సులు నడపాలన్నారు. నాయకులు గణేష్, నాగరాజు, జి.గౌస్, వెంకటేష్, పవన్, ఈరన్న పాల్గొన్నారు.

టిబి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

ఆదోని : పట్టణంలోని టిబి కేంద్రంలో ప్రధాన మంత్రి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం 8 మంది టిబి రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి మాట్లాడారు. టిబి, డిఎంహెచ్ఒ సిబ్బంది కలిసి రూ.1000 విలువ చేసే మూడో విడత సమతుల్య ఆహార కిట్లను అందించామన్నారు. దేశాన్ని టిబి రహితంగా మార్చేందుకు దాతలు ముందుకొచ్చి టిబి రోగులను దత్తత తీసుకోవాలన్నారు. ఎంఒటిసి షేకూన్ భాను, ఎంపిహెచ్ఎస్ బాబురాజు, ఎంపిహెచ్ఎస్ ఇందిరా దొరతి, టిబిహెచ్‌విలు లలితమ్మ, సుబ్బమ్మ బాయి, ఎస్‌టిఎస్ స్వరూప్‌రాజ్ కుమార్, రేడియో గ్రాఫర్ శ్రీనివాసులు, ఎల్‌టి పద్మావతి, ఎల్ఎ రవి ప్రకాష్ పాల్గొన్నారు.

రాజకీయాల్లో హుందాతనం అవసరం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - చిప్పగిరి

కుళ్లు, కుతంత్ర రాజకీయాలు లేకుండా హుందాతనంతో రాజకీయాలు చేయాలని, అందులో తమకు తమ నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదర్శమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రామదుర్గం, డేగులపాడు గ్రామంలోని సొసైటీ అధ్యక్షులు మల్లికార్జున చిన్నాన్న కొడుకు వివాహ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మంత్రితోపాటు ఆయన సోదరులను పూలమాల, శాలువాతో సొసైటీ అధ్యక్షులు మల్లికార్జున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాజకీయం అనేది హుందాతనంతో కూడి ఉండాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగకుండా, ఒక మనిషికి సమస్యలు తెచ్చి పెట్టేలా ఉండరాదని తెలిపారు. రాజకీయాల్లో విశ్వసనీయత ఉంటేనే రాణిస్తామన్నారు. స్వచ్ఛమైన రాజకీయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు వెళుతుండడంతో ప్రజల్లో ఆయనపై నమ్మకం పెంచుకున్నారని తెలిపారు. ఒక నాయకుని చూసి ప్రజలు ఇంతగా సంతోషిస్తున్నారంటే ఇంకేం కావాలన్న ధోరణి కనపడాలన్నారు. ఇటీవల కొంతమంది నాయకులు ఎదగడానికి కుతంత్ర రాజకీయాలు అవలంభిస్తున్నారన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు రావాలంటే ప్రజలతోనే మమేకం కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లు 175కు 175 సీట్లు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి భర్త జూటూరు మారయ్య, డేగులపాడు సర్పంచి నీలకంఠ, సొసైటీ మాజీ అధ్యక్షులు నిరంజన్ ప్రసాద్, ఆలూరు జడ్‌పిటిసి శేఖర్, రాజన్న, శ్రీధర్, సూరి పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి జయరామ్, సోదరులు

పథకాలకు అర్హులను గుర్తించాలి

- జగనన్న సురక్షపై అధికారులకు ఎంపిడిఒ దిశానిర్దేశం

ప్రజాశక్తి - మంత్రాలయం

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించాలని ఎంపిడిఒ మణిమంజరి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ‘జగనన్న సురక్ష’పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టివిలో లైవ్ ద్వారా ఇచ్చిన సూచనలు వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ‘జగనన్న సురక్ష’ ద్వారా మండల స్థాయి అధికారులతో కలిసి సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, గృహసారథులు ఈ నెల 24 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లాలని తెలిపారు. సంక్షేమ పథకాలకు రాజకీయాలకు, కులమతాలకు, వివక్ష చూపకుండా అర్హులను గుర్తించాలని, ఏ సంక్షేమ పథకాలు పొందారో వివరించాలని చెప్పారు. అనర్హులుగా ఎందుకు గుర్తించారో గుర్తించి దరఖాస్తుదారులకు తెలిపి సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు ఉండాలని సూచించారు. సమస్య ఏ శాఖ అధికారి పరిధిలో ఉందో గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జనన, మరణ, వివాహ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. తహశీల్దార్ చంద్రశేఖర్, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రాఘవేంద్ర, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి పాల్గొన్నారు. **దేవనకొండ :** ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల ఇన్‌ఛార్జీ రాజా రెడ్డి, జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంఎల్ఒ జగన్ అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహ సారథులకు ‘జగనన్న సురక్ష’పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ‘జగనన్న సురక్ష’ ద్వారా ప్రతి ఇంటికీ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి వాలంటీర్లు తిరుగుతూ యాప్‌లో పొందుపరిచిన పశ్నలకు లబ్ధిదారుల నుంచి సమాధానాలు సేకరించాలని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, నిర్ణయించిన తేదీలో అధికారుల సమక్షంలో అర్హత కలిగిన వారికి పత్రాలు అందజేస్తామని చెప్పారు. సచివాలయ కార్యదర్శులు అబ్దుల్ రహీం, రిబిక, నరసప్ప, యూసుఫ్ బాష, పెద్ద నరసింహులు, పల్లెదొడ్డి చంద్రన్న, రామాంజనేయులు పాల్గొన్నారు. **నందవరం**లోని సచివాలయం-3లో ‘జగనన్న సురక్ష’ను అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని సచివాలయాల పరిధిలో నెలరోజుల పాటు ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అర్హత ఉండి పథకాలు పొందని వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. తహశీల్దార్ నిత్యానంద రాజు, ఎంపిడిఒ దశరథ రామయ్య, ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, ఇఒఆర్‌డి ఈశ్వరయ్య స్వామి, ఎపిఎం వీరన్న, సర్పంచి సావిత్రి, వైసిపి మండల నాయకులు శివారెడ్డి గౌడ్, జడ్‌పిటిసి నిఖిల్ చక్రవర్తి, కార్యదర్శి రంగనాయకులు పాల్గొన్నారు.



మంత్రాలయంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ



నందవరంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వింటున్న అధికారులు



దేవనకొండలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ

మతసామరస్యాన్ని చాటి చెప్పాలి

- ట్రెయినీ సబ్ కలెక్టర్ రమాకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం


మండలంలో నిర్వహించుకునే ప్రతి పండగలోనూ మత సామరస్యం చాటి చెప్పాలని ట్రెయినీ సబ్ కలెక్టర్ రమాకాంత్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బక్రీద్ పండగను శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో మెలగాలన్నారు. లౌకికత్వాన్ని ప్రతి ఒక్కరూ చాటి చెప్పాలని కోరారు. గ్రామ ప్రముఖులు విశ్వహిందూ పరిషత్ నాయకులు మారుతి మోహన్, ఆవాజ్ కమిటీ నాయకులు ఖాజా హుస్సేన్, షేక్షావలీ, టైలర్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

సైకో పాలనకు ప్రజలే బుద్ధి చెబుతారు

- తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

రాష్ట్రంలో సైకో పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కంబదహాల్ గ్రామంలో రెండేళ్ల క్రితం గ్రామస్తుల ప్రభుత్వం తాగునీటి బోరు వేయించిందని తెలిపారు. విద్యుత్ మోటార్ బిగించడం మరిచిపోయారని చెప్పారు. గ్రామంలో కొన్ని కాలనీలు తాగునీటి కోసం అల్లాడుతున్నా సంబంధిత అధికారులు, ఇక్కడి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కొంతమంది గ్రామస్తులు బోరుకు విద్యుత్ మోటార్ బిగించుకొని నీటిని వాడుకునేందుకు సిద్ధమైతే అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడితో మోటార్‌ను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్తులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.







30న మహాధర్నాను

జయప్రదం చేయండి : ఎఐకెఎస్

ప్రజాశక్తి - బేతంచెర్ల

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 30న విజయవాడలో జరుగు మహాధర్నాలో రైతులు విస్తతంగా పాల్గొని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.సుబ్బరాయుడు, ఏ.రాజశేఖర్‌లు కోరారు. శుక్రవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మండల స్థాయి విస్తృత సమావేశం వి.సుబ్బరాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ.రాజశేఖర్ మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లో పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆహార పంటలకు ఎకరాకు రూ. 10 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. గత రెండు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న సున్నా వడ్డీ పథకం నగదును రైతుల అకౌంట్లో జమ చేయాలన్నారు. ప్రస్తుతం పావలా వడ్డీ పథకం కింద ఇస్తున్న ఒక లక్ష రూపాయల నుండి రెండు లక్షల రుణం రెండు లక్షల నుండి 5 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం ధాన్యానికి క్వింటాకు రూ.800 అదనంగా ఇస్తుందని, అలాగే ఎపి రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎపి రైతు సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సీతారాంపురం జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఆర్.రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా కె.రామ తిమ్మారెడ్డి, గురుస్వామి, సహాయ కార్యదర్శులుగా టి.పద్మావతమ్మ, సర్వోత్తమ రెడ్డి, పక్కీరయ్య, మండల గౌరవాధ్యక్షుడిగా కృష్ణన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బిల్లుల షాక్..!



"బేతంచర్లకు చెందిన నబిరసూల్ గత నెల లాగానే ఈ నెల కూడా విద్యుత్‌ను వినియోగించారు. గత నెల రూ.494 విద్యుత్ బిల్ వచ్చింది. అది ఈ నెలకు రూ.878కి పెరిగింది. అంటే దాదాపు రెట్టింపయింది." ఇలా ఆయనొక్కరికే కాదు ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అందరికీ విద్యుత్ బిల్ భారీగా పెరిగింది. ట్రూఅప్ పేరుతో ప్రభుత్వం అదనపు బాదుడు వేయడమే అందుకు ప్రధాన కారణం...

- భారీగా పెరిగిన విద్యుత్ బిల్లులు
- ఒక్క నెలలోనే సామాన్యులపై రూ.2.31 కోట్ల భారం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సామాన్యులకు ఈ నెలలో విద్యుత్ బిల్లులు ముట్టుకోవాలంటేనే షాక్ కొడుతోంది. గత ఏడాది ఆగస్టు నుంచే తొలి విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండగా ఈ నెల నుంచి రెండో విడత ట్రూఅప్ ఛార్జీలను వసూలు చేస్తుండటంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 11,19,459 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఆ కనెక్షన్ల వినియోగదారులందరూ కలిసి మే నెలలో 10.04 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరం వరకు వాడుకున్న విద్యుత్ వినియోగాన్ని 18 ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా తీసి ట్రూ అప్ చార్జీలు యూనిట్‌కు అప్పట్లో వినియోగించిన యూనిట్‌కు ఏడు పైసల చొప్పున వసూలు చేస్తున్నారని విద్యుత్ శాఖ చెబుతోంది. 2021-2022 సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్‌లో వాడుకున్న వినియోగా కి సంబంధించి అప్పట్లో వాడుకున్న వినియోగానికి యూనిట్‌కు 23 పైసలు చొప్పున ట్రూఅప్ భారం విధించారు. ఆ నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లు జూన్ నెలలో వచ్చింది. అందులో సామాన్యులపై పెంపు భారం పడింది. అంటే 100 యూనిట్లు వినియోగించిన వినియోగదారులకు రూ.23 చొప్పున, 200 యూనిట్లు వాడిన వారికి రూ.46, 300 నుంచి 400 యూనిట్లు వాడిన వారికి రూ.69 నుంచి రూ.92 మేర ట్రూఅప్ రూపంలో పెరిగింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారులందరి మీద ఒక్క నెలలోనే రూ.2.31 కోట్ల మేర ట్రూ అప్ భారం పడింది.

ఎఫ్‌పిపిసిఎ రూపంలో రూ.6.32 కోట్లు

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జస్ట్‌మెంట్(ఎఫ్‌పిపిసిఎ) రూపంలోనూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై తీవ్ర భారం మోపింది. 2023 ఏప్రిల్‌లో వినియోగించుకున్న వినియోగానికి యూనిట్‌కు 40 పైసలు చొప్పునకింద అదనపు చార్జీలు జూన్‌లో వసూలు చేస్తున్నారు. ఇవి విద్యుత్ వినియోగదారుడికి అదనపు భారంగా మారింది. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఉన్న గృహ వినియోగదారులపై ఎఫ్‌పిపిసిఎ రూపంలో ఈ ఒక్క నెలలోనే రూ.6.32 కోట్ల మేర భారం పడింది. వినియోగదారులపై ట్రూఅప్‌తో పాటు ఎఫ్‌పిసిసిఎ రూపాల్లో భారం వేయడంతో యూనిట్‌కు 63 పైసల చొప్పున భారం పడింది. గతంలో నెలకు రూ.150 నుంచి రూ.300 వచ్చే వారికి రూ.250 నుంచి రూ.600 వరకు విద్యుత్ బిల్లులు వచ్చాయి. రూ.400 నుంచి రూ.600 వచ్చే వారికి రూ.600 నుంచి రూ.800, రూ.600 నుంచి రూ.800 బిల్లు వచ్చే వారికి రూ.850 నుంచి రూ.1100 వరకూ ఈ నెల విద్యుత్ బిల్లులు వచ్చాయి.

భారంగా పెరిగిన బిల్లులు



నా భర్త పాలిష్ బండల ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఆయనకు వచ్చే జీతంతో కుటుంబం గడుస్తోంది. గత నెలకు, ఈ నెలకు భారీగా విద్యుత్ బిల్లులు పెరిగాయి. అది భారంగా మారింది. గత నెల రూ.494 బిల్లు వస్తే ఈ నెల రూ.878 వచ్చింది. అంతంత బిల్లులు వస్తే ఎలా కట్టాలి.

- ఎస్.రెహానా, బేతంచర్ల.

ఎస్ఎస్‌సి సప్లిమెంటరీలో 64.99 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎస్ఎస్‌సి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో నంద్యాల జిల్లాలో 64.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తం 10,092 మంది పరీక్షలకు హాజరయ్యారు. అందులో బాలురు 5896 మంది, బాలికలు 4196 మంది పరీక్షలు రాయగా 6,559 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో 64.99 శాతం ఉత్తీర్ణతో 11వ స్థానంలో నంద్యాల జిల్లా నిలిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు రీ కౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈ నెల 29 లేదా అంతకుముందు సిఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానా (www.cfms.ap.gov.in) ద్వారా ఒక్కో సబ్జెక్టుకు రూ.500 మొత్తాన్ని చెల్లించాలన్నారు. జవాబు పత్రాల ఫొటో కాపీ, పునః ధృవీకరణ (రీ వెరిఫికేషన్) సరఫరాల కోసం దరఖాస్తు చేసుకోవాలను కునే అభ్యర్థులు చలానా ప్రతి సబ్జెక్టుకు రూ.1000 మొత్తాన్ని ఈ నెల 29 లేదా అంతకుముందు చెల్లించాలని వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

- నెల రోజుల పాటు 'జగనన్న సురక్ష' నిర్వహణకు సర్వం సిద్ధం
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సంక్షేమ పథకాలకు అర్హులై వుండి ఏ ఒక్కరూ లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న ప్రధాన లక్ష్యంతో, ఏ చిన్న సమస్య వున్నా పరిష్కరించాలన్న చిత్తశుద్ధితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెలరోజుల పాటు నిర్వహించే 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్‌తో పాటు జెసి నిశాంతి.టి, ఎమ్మెల్సీ ఇసాక్ భాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మార్క్ఫెడ్ చైర్మన్ పిపి.నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డిఆర్ఒ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ సుబ్బారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు (మిగతా 6లో..)



వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జెసి తదితరులు

అమ్మఒడి 'వేలిముద్ర' కష్టాలు

- సచివాలయంలోనే వేయాలన్న వాలంటీర్లు - వ్యయ ప్రయాసలతో వచ్చిన గిరిజన విద్యార్థుల తల్లులు
- 12 గంటల తర్వాత వచ్చిన ఎర్రమఠం అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - కొత్తపల్లి

వైసిపి ప్రభుత్వం నవరత్నాల పేరుతో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వేలిముద్రలు వేయించుకుంటుంది. వేలిముద్రలను సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి తీసుకోవాల్సి ఉంది. అయితే కొత్తపల్లి మండలంలోని ఎర్రమఠం సచివాలయ పరిధిలోని గ్రామాల్లోని విద్యార్థుల తల్లులు అమ్మ ఒడి పథకం కోసం సచివాలయం వద్దకే వచ్చి వేలిముద్ర వేయాలని వాలంటీర్లు, సిబ్బంది చెప్పారు. దీంతో వేలిముద్ర వేసేందుకు గిరిజన గ్రామాల విద్యార్థుల తల్లులు శుక్రవారం అష్టకష్టాలు పడ్డారు. అధికారులు మధ్యాహ్నం 12 గంటల తర్వాత రావడంతో ఎంతో కష్టపడి వచ్చిన తల్లులు వారి కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొత్తపల్లి మండలం అధికారులకు దూరంగా నల్లమల అడవులకు సమీపంలో ఉంది. నల్లమల అడవులకు అతి సమీపంలో సిద్దేశ్వరం, జానాల గూడెం, బలపాల తిప్ప గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో చెంచులు, ఎస్సీలు ఎక్కువ మంది ఉన్నారు. ఎర్రమఠం గ్రామ సచివాలయం పరిధిలో పాత మాడుగుల, కపిలేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆర్థిక చేయూతగా అమ్మ ఒడి కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అమలు చేస్తుంది. ఈ పథకం నగదు మొత్తం తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కావాలంటే బయోమెట్రిక్ అథటికేషన్ చేయాల్సి ఉంది. ఇందుకు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ విద్యార్థుల తల్లుల వద్దకు వెళ్లి బయోమెట్రిక్ అథటికేషన్ చేయించాలి. కానీ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తల్లులే సచివాలయానికి వచ్చి బయోమెట్రిక్ వేయించుకోవాలని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చెప్పారు. ఈ గ్రామాల ప్రజలకు సచివాలయానికి వచ్చేందుకు ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. అమ్మ ఒడి కోసం వేలిముద్ర వేసేందుకు సుమారు 20 నుంచి 30 మంది దాకా గిరిజన విద్యార్థుల తల్లులు ఎర్రమఠం గ్రామంలో ఉన్న సచివాలయం వద్దకు శుక్రవారం వచ్చారు. అధికారులు మధ్యాహ్నం 12 గంటల తర్వాత రావడంతో చంటి పిల్లలతో వచ్చిన గిరిజన విద్యార్థుల తల్లులు తిండి తిప్పలు లేక పస్తులతో గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం ఆటోలో 50 రూపాయలు ఖర్చు పెట్టుకుని, రోజు వారి కూలి పోగొట్టుకొని అమ్మ ఒడి కోసం వేలిముద్ర వేసేందుకు వస్తే అధికారులు ఆలస్యంగా రావడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజల వద్దకే పాలన అంటూ ఎంతో ఆర్భాట ప్రచారాలు చేస్తున్నా ఆచరణలో మాత్రం శూన్యం. సచివాలయం అధికారులు, గ్రామ వాలంటీర్లు కలిసి ప్రజల వద్దకు వెళ్లి అర్హుల నుంచి వివరాలు సేకరించి, తంబు వేయించుకోవాలన్న ఆదేశాలు జిల్లా అధికారుల నుంచి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాబోవు రోజుల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది, వాలంటీర్లు గ్రామాలకే వెళ్లి వేలిముద్ర వేయించుకునేలా చూడాలని గిరిజన మహిళలు కోరుతున్నారు.



అధికారుల కోసం వేచి ఉన్న చెంచు మహిళలు



మాట్లాడుతున్న నాయకులు

పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి శంసుల్ హక్, ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు బరగొడ్ల హుస్సేన్ భాషాలు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తాము చేసిన సేవలను గుర్తించి ఆళ్లగడ్డ అసెంబ్లీ కోఆర్డినేటర్లగా నియమించడం పట్ల వారు పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్త స్థాయి నుండి పార్టీ పట్ల అంకితభావంతో పని చేస్తున్న తమకు పార్టీలో ఒక కేడర్, గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కష్టపడే మనస్తత్వం, పార్టీ పట్ల అంకితభావం ఉండేవారికి కాంగ్రెస్‌లో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. రానున్న ఎన్నికలలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని, అందుకోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుకి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలికి, నంద్యాల డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్‌కు, పార్టీ నాయకులకు, పెద్దలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకతాయికి 15 రోజులు రిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల లీగల్

నంద్యాల పట్టణంలో ఒక వ్యక్తి మద్యం సేవించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తుండడంతో అదుపులోకి తీసుకుని నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామభూపాల్ రెడ్డి ముందు హాజరుపరచగా 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మీడియాతో ఎస్పి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్‌లో రాత్రి సమయంలో టు టౌన్ పోలీసులు గస్తీ తిరుగుతుండగా పబ్లిక్ రోడ్డులో ఒక వ్యక్తి మద్యం సేవించి మహిళలకు సైగలు చేస్తూ, ఈలలు, కేకలు వేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తుండగా స్వాధీనంలోకి తీసుకున్నట్లు చెప్పారు. స్పెషల్ రిపోర్ట్ ద్వారా పోలీస్ స్టేషన్‌లో హాజరు పరచగా సదరు వ్యక్తిపై సెక్షన్ 294 మేరకు కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జి షీట్ దాఖలు చెయ్యగా మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగినా, శాంతిభద్రతల విషయంలో ఆటంకం కలిగించినా, మహిళలను కించపరిచే విధంగా ప్రవర్తించినా అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పసుపు కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పసుపు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని కనీస మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో మార్కెట్ ధర కంటే మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు క్వింటా రూ.6,850 ధర కల్పిస్తూ రైతులను ఆదుకుంటున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్లో క్వింటా రూ. 4,500 నుంచి రూ. 5 వేలు ఉండగా ప్రభుత్వం మద్దతు ధర రూ. 6850 కల్పించిందన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల మిర్చి రైతులకు సమీపంలోని నంద్యాల మార్కెట్ యార్డులో మద్దతు ధరకే మిర్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్కెఫెడ్ చైర్మన్ మాట్లాడుతూ గత 4 సంవత్సరాలుగా ఎపి మార్కెఫెడ్ ద్వారా పసుపు, మొక్కజొన్న, శనగలు రైతుల నుండి మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మండలంలో, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బికేల ద్వారా వ్యవసాయానికి సంబంధిత సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రైతులకు అన్ని విధాల అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చిమ్మా నాగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగరాజు, వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ కల్పన, యార్డు కమిటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పసుపు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

ప్రజాశక్తి - మహానంది

మహానంది క్షేత్ర పరిధిలో నిషేధిత సిగరెట్, గుట్కా, పాన్ మసాలాలు స్వాధీనం చేసుకున్నట్లు మహానంది దేవస్థానం ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది క్షేత్ర పరిధిలో ఉన్న దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. నిషేధిత సిగరెట్, గుట్కా, పాన్ మసాలాలను పాలకమండలి సభ్యులు జి.మల్లికార్జున సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవడమే కాక జరిమానాలు విధించడంతోపాటు, వారి షాపులు కూడా రద్దు పరుస్తామన్నారు. ప్రస్తుతం మొదటిసారి హెచ్చరించి వదిలేశామని అన్నారు. మరోసారి ఇలాగే అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటివి క్రయవిక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరినట్లుగా తెలిపారు. శనివారం ఉదయం మహానంది దేవస్థానం కార్యాలయంలోని షాపులు, హోటల్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. క్షేత్ర పరిధిలో భక్తులకు ఎంఆర్‌పి రేట్లకే తినుబండారాలు విక్రయించాలన్నారు. హోటళ్ల నిర్వాహకులు ఆరోగ్య భద్రత విభాగం నుండి తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలన్నారు. పాలిథిన్ కవర్లు విక్రయించరాదన్నారు. క్షేత్రంలోని ఓ హోటల్ వద్ద కళ్యాణ మండపాలు, వసతి గృహాలు, ప్రైవేటు వ్యక్తులు బుకింగ్ చేసుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దాడుల్లో ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ సిబ్బంది, ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫైర్‌మెన్ దుర్మరణం



ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బత్తలూరు-నల్లగట్ల గ్రామాల మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న పగడాల సంజీవ రాయుడు (42) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలు.. నంద్యాల నుండి ఆళ్లగడ్డకు ఆయన బైక్‌పై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సంజీవరాయుడి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటీవల ఆయన ఆళ్లగడ్డ నుండి నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆమెకు కూడా నంద్యాల ప్రాంతానికి బదిలీ రావడంతో ఫ్యామిలీ షిఫ్టింగ్ చేసే నిమిత్తం ఆయన ఆళ్లగడ్డకు వస్తుండగా ప్రమాదం జరిగింది. సంజీవరాయుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంజీవ రాయుడు అంత్యక్రియలు ఉయ్యాలవాడలో జరిగాయి.

ఒలంపిక్ క్రీడలలో సత్తా చాటాలి : సిఐ

ప్రజాశక్తి - బనగానపల్లె

ఒలంపిక్ క్రీడల్లో మన దేశ సత్తాను క్రీడాకారులు చాటాలని సిఐ తిమ్మారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం అవరణలో ఒలంపిక్ డే రన్-2023 సందర్భంగా క్రీడా జ్యోతిని సిఐ తిమ్మారెడ్డి, యువ నాయకులు, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్ రెడ్డిలు వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుండి పోలీస్ స్టేషన్, ఆస్థానం మీదుగా సర్కిల్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాటసాని ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నందివర్గం ఎస్సై రామాంజనేయ రెడ్డి, వైసిపి మైనారిటీ నాయకులు అత్తార్ జాహిద్ హుస్సేన్, సీనియర్ న్యాయవాది మాధవ రెడ్డి, అవుకు ఎంఈఓ శ్రీధర్ రావు, వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాజ్యోతిని ప్రారంభిస్తున్న సిఐ తిమ్మారెడ్డి వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి





కార్యక్రమంలో మాట్లాడుతున్న వైసిపి యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి

మత్స్యకారుల అభివృద్ధికి కృషి : వైసిపి

ప్రజాశక్తి - అవుకు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు, వైసిపి యువ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం అవుకు రిజర్వాయర్ వద్ద మత్స్యకారులతో ఆత్మీయ సమ్మేళనం చల్లా కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుకు పట్టణంలో మత్స్యకారుల సంఘం చాలా పెద్దదని, అనాదిగా చల్ల కుటుంబానికి, మత్స్యకారుల సంఘానికి అవినాభావ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకారుల సంఘంలో ఏ సమస్య వచ్చినా చల్లా కుటుంబం అండగా ఉండి పరిష్కరించేదని, దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి లేని లోటు తీర్చలేనిదని, మీ అందరి సహకారం వల్ల మళ్లీ అవుకు పట్టణాన్ని అభివృద్ధి దిశలో నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎంతోమంది వస్తుంటారు పోతుంటారని, వారి మాటలు వినవద్దని, ఎప్పటికీ చల్లా కుటుంబం ఇక్కడే ఉండి మీ బాగోగులు చూస్తుందని తెలిపారు. అనంతరం వైసిపి సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్ పర్సన్ చల్లా విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా అమర్నాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, మాజీ ఉప సర్పంచి దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, వైసిపి మండల నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు ప్రసంగించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం ప్రెసిడెంట్, సంఘం సభ్యులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

మురికి కూపంలా నందమూరి నగర్ : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్ 37వ వార్డు వీధి కుక్కలు, చెత్తాచెదారం, మురికి నీటితో నిండి దయనీయ పరిస్థితిలో ఉందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అన్నారు. శుక్రవారం సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి నగర్ ఏర్పడి 40 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ మౌలిక వసతులు లేవన్నారు. ఇప్పటికైనా సిసి రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు తదితర మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హుస్సేనన్న, మాభాష, భాష, రాము మహిళలు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం

2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి

కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారి 167కె నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్ సంజీవ రాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు ఇన్పుట్ సబ్సిడీ రైతులకు మద్దతు ధర తదితర సమస్యలను పరిష్కరించాలని కొత్తపల్లి మండలంలోని శివపురం పెద్ద గుమ్మడాపురం ముసలమడుగు ఎర్రమఠం తదితర గ్రామపంచాయతీలలోని రైతు భరోసా కేంద్రాలలో వి .ఏ.ఏ.లకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు జరిపి గత సంవత్సరం పంట నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. కొత్తపల్లి మండలంలోని మెట్ట భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ దేవకుమార్, పి ఏసన్న, జి దాసు మూర్తి, గఫూర్ మియా, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జిల్లా కార్యదర్శి బొల్లు ప్రసాద్ బాబు యాదవ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలను తగ్గించాలి : ఐఎఫ్టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన వంట గ్యాస్,కరెంటు చార్జీలను తగ్గించాలని ఐఎఫ్టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. శుక్రవారము సున్నిపెంటలోని ఐఎఫ్టియు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంటు చార్జీలు, గ్యాస్ ధరలు ఆకాశానికి పెరగడం వలన పేద మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవ సరాల ధరలను తగ్గించాలని కోరారు. సమావేశంలో ఐఎఫ్టియు మండల అధ్యక్షులు వై.శ్రీను, కార్యదర్శి మల్లికార్జున,వెంకటేశ్వర్లు,బాబు, పాల్గొన్నారు.

రైతుకు రసీదు ఇవ్వాలి

- వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ

ప్రజాశక్తి - ప్యాపిలి



దుకాణాలను తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఎరువులు, విత్తనాలు అమ్మేటప్పుడు దుకాణదారులు రైతుకు రషీదు తప్పకుండా ఇవ్వాలని వ్యవసాయ సంచాలకులు ఆంజనేయ అన్నారు. శుక్రవారం మండలంలోని విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారి ఏ.రాజేష్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా రిజిస్టర్లు, రికార్డులు నిర్వహించలేదని రూ.17,243 విలువగల విత్తనాలు, రూ.863,700 విలువగల ఎరువులు అమ్మకాల నిలుపుదల చేశారు. అధిక ధరలకు అమ్మితే లైసెన్సు రద్దునకు సిఫార్సు చేస్తామని డీలర్లకు హెచ్చరించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, లేకపోతే చంద్రబాబు నాయుడుకు పట్టిన గతే సిఎం జగన్‌కు పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు హెచ్చరించారు. శుక్రవారం నందికొట్కూరు సిపిఎం కార్యాలయం ఆవరణలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుదలపై రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం నాయకులు పి ఫకీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, డాక్టర్ వినోద్ కుమార్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు అల్లప్ప, మజీద్ మియా, అరుణ్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు రంగమ్మ ,మాల మహానాడు నాయకులు శివ, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు బాలస్వామి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ సంస్కరణలు తెచ్చి డిస్కో, ట్రాన్స్కో, జెన్కో పేరుతో విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసి ప్రజలపై భారాలు మోపారని, వాటి వ్యతిరేకంగా ఆనాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి వామపక్షాలతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు 10 సంవత్సరాల పాటు అధికారం కోల్పోవడం జరిగిందన్నారు. నేడు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నరేంద్ర మోడీకి తలొగ్గి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో నాలుగు సంవత్సరాల కాలంలో రూ.25 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం జరిగిందన్నారు. ఈనెల 30వ తేదీన నందికొట్కూరులో కిసాన్ పార్క్ నుండి విద్యుత్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు టి ఓ బ్లెస్, వేణుగోపాల్, రమేష్ ,సీతారాం వెంకటేశ్వర్లు, గౌడ్ ,నారాయణ తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల:** సామాన్య పేద మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రజలు వ్యతిరేకించాలని బేతంచర్ల సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, సిపిఎం సీనియర్ నాయకులు వై ఎల్లయ్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కరెంట్ బిల్లులతో జనానికి షాక్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నాయన్నారు. నాలుగేళ్లలో 25 వేల కోట్ల రూపాయలు ప్రజల నెత్తిన మోపాయన్నారు. పెంచిన కరెంటు చార్జీలను, సర్దుబాటు చార్జీలను విరమించుకోవాలని కోరారు. సిపిఎం కమిటీ సభ్యులు బి రామాంజనేయులు, జి. శోభారాణి, ఎస్. గుల్జార్ బి, ఎస్కే బాష, రాజబాబు, బాలయ్య, వెంకటరమణ పాల్గొన్నారు. **పాములపాడు:** మరో కరెంటు ఉద్యమానికి రైతాంగం ప్రజలు సిద్ధం కావాలని రైతు సంఘం సీనియర్ నాయకులు బి రామేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాములపాడలో వ్యకాసం జిల్లా నాయకులు బాలయ్య అధ్యక్షన కరెంటు బిల్లులతో జనానికి షాక్ కార్యక్రమంలో ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ఆర్ రమణ, మహిళా సంఘం నాయకురాలు రవణమ్మ, మాల మహానాడు జిల్లా నాయకులు అబ్రహాము, రజక సంఘం నాయకులు రామకృష్ణ, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు షర్ఫుద్దీన్అలీ, నాయకులు నాగరాజు, కెవిపిఎస్ నాయకులు జయరాజు, నాయకులు రమేష్ మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎం. నాగేశ్వరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



మాట్లాడుతున్న నాయకులు



ఉరుకుంద గ్రామంలో సచివాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు మా బాష తదితరులు

మోటార్లకు మీటర్ల బిగింపు మానుకోవాలి

- రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను ఉపసంహరిం చుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు మాబాషా, కార్యదర్శి ఎన్ వీరన్న లు అన్నారు. శుక్రవారం మండలంలోని కురుకుంద, నల్లకాల్వ రైతు భరోసా కేంద్రంలో రైతు భరోసా కేంద్రం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం, వాణిజ్య పంటలకు రూ.25వేలు ఇవ్వాలని, హైవే రోడ్డు 167 నంద్యాల, కల్వకుర్తి రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారము నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, ఈ క్రాఫ్ కౌలుదారు పేరుతోనే చేయాలని పాడి రైతులకు ఒక లీటరుకు రూ.4 ఇవ్వాలని నకిలీ విత్తనాలు చలామణిలో రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సలీమ్, లింగస్వామి, రసీదు, రాముడు, కష్ణమోహన్, నాగన్న, యోహాను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి



ఆళ్లగడ్డ : జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి..) లాంఛన కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు నిర్వహించే క్యాంపులలో అక్కడికక్కడే పథకాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. అలాగే అవసరమైన వారికి సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కం మొదలైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు), అవసరమైతే సర్వీస్ ఫీజు లేకుండా అందించనున్నట్లు చెప్పారు. కులమత, వర్గ, పార్టీలకు అతీతంగా, లంచాలకు, వివక్షకు తావులేకుండా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ సమన్వయంతో, బాధ్యతతో విజయవంతం చేయాలని కోరారు.

మహానంది : మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని తహశీల్దార్ జనార్దన్ శెట్టి అన్నారు. మండలంలోని గాజులపల్లె గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైపిపి శ్రీశైలం నియోజక వర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జెడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, గాజులపల్లి నాయకులు కొండా మధుసూధన్ రెడ్డి, కిట్టు, వీఆర్వో వెంకటరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. పట్టణంలోని షాదీ ఖానాలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. కమిషనర్ మాట్లాడారు. జగనన్న సురక్ష పథకం ప్రాముఖ్యతను, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాత్రను వివరించారు. తహశీల్దార్ హరినాథ్ రావు మాట్లాడారు. అసిస్టెంట్ ఇంజనీర్ సురేంద్రనాథ్ రెడ్డి, టిపిఎస్ రామకృష్ణ, రెవెన్యూ ఆఫీసర్ జిలానీ భాష, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఏసురత్నం, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి : ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షుతన మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లతో జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. గడపగడపకు వెళ్ళి వారికి అవసరమైన జనన,మరణ,వివాహ, తదితర 11 రకాల ధృవపత్రాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమ ంలో ఎంపిడిఓ మహబూబ్ దౌలా,తహసిల్దార్ విజయ్ కుమార్,ఏఓ రంగ నేతాజీ,ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డి సుదర్శన్ రావు,ఎంఎల్ఓ హరికృష్ణ, పంచా యతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వెంకట రమణ, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అన్నారు. శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు వార్డు మెంబర్లు గ్రామాలలో ఇంటింటా తిరిగి ప్రభుత్వ అమలు చేసిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలని అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్ర మంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొ న్నారు.

ఆత్మకూరు: మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం నాడు ఎంపిడిఓ మోహన్ కుమార్, తాసిల్దార్ ఉమారాణి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సచివాలయం సచివాలయం సిబ్బందికి, గ్రామ వాలంటీర్స్‌కు అవగాహన కల్పించారు.

పాములపాడు: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధిక కోరారు. ఎంపీడీవో కార్యాలయం నందు డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి శ్రీనివాస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమ ంపై పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలకు, సచివాలయ సిబ్బందికి, గృహసారథులు, కన్వీనర్లు, వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, డిప్యూటీ తాసిల్దార్ హరిత, జెసిఎస్ కన్వీనర్ పుల్లారెడ్డి, మండల కన్వీనర్ పార్థసారథి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

- డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ :రాష్ట్ర వ్యాప్తంగా 15,004 గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజులపాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమా న్ని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశ్యాన్ని రాజేష్ వివరించారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, తర్వాతి రోజు వాలంటీర్లు, గృహసారధు లు ప్రతి ఇంఇకి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కావల్సిన పత్రాలను అప్పుడే సేకరిస్తారన్నారు. వారంరోజుల తరువాత జగనన్న సురక్ష క్యాంపు ఉంటుందన్నారు. అందులో మండల స్థాయి అధికారులు ప్రతి సచయివాలంలో ఒక రోజు ఉండి అక్కడికక్కడే పథకాల సమస్యల పరిష్కారం , పత్రాలను జారీ చేస్తారన్నారు. పథకాల అమలును అర్థమయ్యేలా చెప్పడంతో పాటు పరిష్కారం చేస్తారన్నారు. అదేశింగా ప్రతి ఒక్కరికి అవలసరమయ్యే కుల, ఆదాయ, జననమరణ, వివాహ, కుటుంబసభ్యుడి ధృవీకరణ పత్రాలపై ప్రత్యేక దృష్టి పెడతారన్నారు. అదేవిధంగా భూమి మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ అనుసంధానం, పంటసాగు హక్కుకార్డు వంటివి ఉన్నాయా లేవా తెలుసుకుని అందరికి ఇచ్చే చర్యలు తీసుకుంటారన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇళ్ల నాగవల్లి మృతి

- నాలుగేళ్లు అయిన వేంపెంటను సందర్శించని ఐటిడిఎ పిఒ - ఎపి గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్

ప్రజాశక్తి - పాములపాడు

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే క్షయ వ్యాధితో నాగవల్లి (10) మృతి చెందిందని, వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం నరసింహ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు మల్లికార్జునలు డిమాండ్ చేశారు. మండలంలోని వేంపెంట చెంచుగుడెనికి చెందిన ఇళ్ల నాగవల్లి మూడు సంవత్సరాల నుంచి క్షయ వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మరణించింది. ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం నరసింహ నాయక్, గిరిజన సంఘం జిల్లా నాయకులు మల్లికార్జునలు శుక్రవారం నాడు వేంపెంట చెంచు గూడెని కెళ్లి మరణించిన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగవల్లికి సరైన పౌష్టిక ఆహారం లేక, ఉపాధి పనికి పోయి నాలుగు వారాలు అవుతున్న ఉకూలీలు రాకపోవడం సరైన ఆహారం లేక చనిపోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్నటువంటి అరకొర పౌష్టికాహారం సరిపోవడం లేదన్నారు. వారికి ఎన్ఐసి వచ్చినాక ఉపాధి హామీ చట్టం ద్వారా వచ్చే పని దినాలు సరిపోవడం లేదన్నారు. చేసిన పనికి సమయానికి డబ్బులు రాకపోవడంతో బిడ్డ మరణించడం జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తపరిచినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా ఐటీడీఏ ప్రభుత్వ అధికారులు స్పందించే ఇకనుంచి ఇటువంటి మరణాలు సంభవించకుండా చూడాలని అన్నారు. ఐటీడీఏ పీవో నాలుగున్నర సంవత్సరాలైనా ఇంతవరకు గూడెం ను సందర్శించడం లేదన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజన గూడాలను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

అధికారులు పేదలకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి - ఆత్మకూరు



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న బాధితులు

ఆత్మకూరు పట్టణంలోని మేడవరం శివ నాగమ్మకు చెందిన సర్వే నెంబర్ 909లో నాన్ అగ్రికల్చర్ ల్యాండ్‌ను అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి ఆర్డీవో అగ్రికల్చర్ ల్యాండ్‌గా మార్చి రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణకు కట్టబెట్టారని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ సంపత్ ఆరోపించారు. శుక్రవారం నాడు బాధిత కుటుంబ సభ్యులు ఆర్డీవో కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేస్తున్న శివనాగమ్మ కుటుంబ సభ్యులకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడవరం శివ నాగమ్మకి వారి అత్తగారైన చిన్నమ్మ వీలునామా ద్వారా 1.55 ఎకరాల భూమిని ఇవ్వగా 1984లో ఆ భూమిలో ప్లాట్లు వేసి కొన్ని ప్లాట్లను అమ్మడం కూడా జరిగిందన్నారు. ఈ సమస్య పైన కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ ఆర్డిఓ అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి లక్ష్మీ నారాయణకు అమ్ముకునేందుకు హక్కు కల్పించే విధంగా తాసిల్దార్‌కి ఆదేశాలు ఇవ్వడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ఆర్డీవో పునరాలోచిం పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సర్వీసులను సద్వినియోగం చేసుకోండి

- నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి

గ్రామ, వార్డు సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' కింద ప్రజలకు అవసరమైన కీలక పత్రాలను సేవా రుసుము లేకుండా అందించనున్న ఉచిత సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. బేతంచర్ల నగర పంచాయతీ కార్యాలయము నందు శుక్రవారం నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు ఎల్లప్పుడూ అవసరం ఉన్న 11 రకాల సర్టిఫికేట్‌ల జారీ అదే రోజు వెంటనే మంజూరు చేసి, అర్జీ, లబ్ధిదారులకు సంతృప్తి స్థాయి పెంచేందుకు ఎల్లవేళలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ మధు, నాగ వెంకటేశ్వర్లు,ఎల్లయ్య,అధికారులు అంజాద్ బాషా శేఖర్, మధుసూధన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు గూని నాగరాజు, దస్తగిరి, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు


ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-డోన్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిం చాలని ఎస్ఎఫ్ఐ డోన్ మండల సహాయ కార్యదర్శి బి.సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలని నిరసన తెలియజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులు పాఠ్య పుస్తకాలు కొనుక్కోవాలంటూ ఇంటర్ విద్యాశాఖ ఆదేశించడాన్ని ఖండిస్తున్నామ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యకు ప్రత్యేక నిధులు కేటాయిం చకపోగా విద్యార్థులు ఫీజులు ద్వారా కట్టిన ఇంటర్ విద్యామండలి నిధులు మొత్తం నాడు-నేడు పథకానికి దారి మళ్లించడాన్ని సిగ్గుచేటు అన్నారు. వెంటనే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలని, లేనియెడల ఆందోళనలకు పూనుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తెలుగు విజయ్ కుమార్,ఎస్ఎఫ్ఐ నాయకులు తాజ్,చిన్న,మహేంద్ర,లతా,మాధురి,పుష్ప, జ్యోతి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - నందికొట్కూరు



జూపాడు బంగ్లా మండలంలోని తరిగోపుల గ్రామంలో గ్రామ సర్పంచి బోయ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో కర్నూలు శాంతిరాం వైద్యశాల డాక్టర్లు శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని 208 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. కంటి చూపు సమస్య అధికంగా ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు తరిగోపుల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పిహెచ్‌సి నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం కంపెనీ ఇంజనీర్ రామచంద్రయ్య మాట్లాడుతూ రూ.1.80 కోట్ల నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గత కొన్ని రోజుల నుంచి బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణం పనులు నిదానంగా జరిగాయని, ప్రస్తుతం బిల్లులు మంజూరు కావడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేసి ఆరోగ్య కేంద్రాన్ని అధికారులకు అప్పగిస్తామన్నారు. పనుల్లో ఎటువంటి నాణ్యత కొరపడకుండా పూర్తి చేస్తున్నామన్నారు.



పిహెచ్‌సి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కంపెనీ ఇంజనీర్ రామచంద్రయ్య

ఫిర్యాదుపై ఎపిడి విచారణ

ప్రజాశక్తి - పాములపాడు



విచారణ చేస్తున్న ఎపిడి

మండలంలోని వానాల గ్రామంలో ఉపాధి హామీ పనిలో ఒక వర్క్ ఐడిలో ఫోటోలు దిగి మరో వర్క్ ఐడీలో పని చేశారని గ్రామస్తులు కలెక్టర్ ఫిర్యాదు ఇవ్వడంతో పిడి ఆదేశాల మేరకు విచారణ నిమిత్తం ఎన్ఆర్ఈ జీఎస్ ఏపీడి అన్వర్ బేగం శుక్రవారం విచారించారు. ఏపీడి అన్వర్ బేగం మాట్లాడుతూ పనిచేసిన వర్క్ ఐడి లోనే ఫోటోలు దిగారని, ఫీల్డ్ అసిస్టెంట్ లేనికారణంగా ఉపాధి కూలీలు అవగాహన లోపం ఉందన్నారు. నివేదికను పై అధికారులకు పంపనున్నట్లు తెలిపా రు.

అసత్యపు ఆరోపణలు మానుకో...

టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకుడికి ఎమ్మెల్సీ ఇసాక్ బాషా హితవు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

టిడిపి రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా హితవు పలికారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మౌలానా వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జామియా మసీద్ సంబంధించి వక్ఫ్‌బోర్డు వారు ఎన్నికలు జరపమని చెప్పినా జరపకుండా కబ్జా చేశారని చెప్పడంలో ఎంత మాత్రం వాస్తవం లేదన్నారు. సాక్ష్యాధారాలు ఉంటే వాస్తవాలను నిరూపించాలని ఛాలెంజ్ చేశారు. పోస్టాఫీస్ ఎదురుగా అన్యాక్రాం తంగా అక్రమ కట్టడాలను కట్టానని తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నాడు టిడిపి ప్రభుత్వం హయాంలో కట్టడానికి అనుమతులను ఇచ్చారని, అందుకు సంబంధించిన బ్లూప్రింట్, అనుమతుల పత్రాలను చూపారు. వ్యక్తిగత విషయాలను ప్రస్తావించడం మొదలు పెడితే నీ పరిస్థితి, బండారం బహిర్గతం అవుతుందని, నోరుమూసుకొని ఉండాలని హితవు పలికారు. ఆత్మకూరు, నంద్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎవరికి ఎంత ఇచ్చావో, ఎవరిని ఎంత ముంచావో తెలుసన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాబున్నీసా, మైనార్టీ నాయకులు జాకీర్ హుసేన్, మార్కెట్ కలాం తదితరులు పాల్గొన్నారు.